

# కథ

గన్నవరపు నరసింహమూర్తి

# మంచుగోడ

సాయంత్రం నా ఆఫీసు పని పూర్తవ్వగానే శృతి ఆఫీసుకు బయలుదేరాను. ఇక్కడికి శృతి ఆఫీసు మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఆ సమయంలో విపరీతమైన ట్రాఫిక్ జామ్స్ వల్ల నలభై నిమిషాలకుపైగా పట్టింది అక్కడికి చేరేసరికి. ముందే ఫోన్ చేయడం వల్ల అక్కడ ఆమె నా కోసం ఎదురుచూస్తోంది. వెంటనే ఆమెను కార్లో ఎక్కించుకొని ఇంటి వైపు బయలుదేరాను. ఆమెను చూడగానే బాగా అలసిపోయినట్లు కనిపించింది.

ఇద్దరం చాలాసేపటి వరకు మాట్లాడుకోలేదు. ఆమె సీటు మీదకు వాలి కళ్లు మూసుకొని ఉండటం వల్ల నేను కూడా మాట్లాడే ప్రయత్నం చేయలేదు.

నాకు శృతితో ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో నాకు చాలా సంబంధాలు వచ్చినా శృతి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావడమే కాకుండా హైదరాబాద్‌లోనే పని చేస్తుండడంతో ఆమె వైపే మొగ్గు చూపాను. ఈ ఆరు సంవత్సరాల్లో ఇద్దరు పిల్లలు పుట్టారు మాకు. పెద్దవాడు కౌశిక్‌కి నాలుగేళ్లు. రెండోది కృతి. దానికి రెండేళ్లు.

మాకు సమస్యలు పిల్లలు పుట్టగానే మొదలయ్యాయి. అందుకే కౌశిక్ పుట్టగానే కొన్నాళ్లపాటు జాబ్ మానెయ్యమన్నాను. అయినా ఆమె వినలేదు. శృతితో ఉన్న పెద్ద సమస్యే అది. ఆమె ఎవరి మాటా వినే రకం కాదు. అందుకనీ వాడి ఆలనాపాలనా కోసం ఒక ఆయాని పెట్టవలసి వచ్చింది. పోనీ వాడి తరువాత కొన్నాళ్లపాటు గేప్ ఇద్దామని చెబితే అందుకు కూడా ఆమె ఒప్పుకోలేదు. ఇంకో కానుపు కూడా అయిపోతే ఇక కెరియర్ మీద దృష్టి పెట్టొచ్చని ఆమె వాదన. ఆయాకి నెలకి ఐదువేల రూపాయలిస్తున్నా ఆమె వాళ్లని సరిగ్గా చూడదు.

పులిమీద పుట్రలా నాలుగు నెలల క్రితం శృతి పిడుగులాంటి వార్త చెప్పింది. వాళ్ల కంపెనీ శృతికి టీం లీడర్‌గా పదోన్నతి కల్పించి ఒక కొత్త ప్రాజెక్టు బాధ్యతప్పగించింది. దాని పని మీద మూడు నెలల పాటు బెంగుళూరు ఆఫీసుకు వెళ్లాలని సూచించింది. ఆ విషయం విన్న నాకు మతిపోయింది. ఇద్దరం ఇక్కడ ఉంటేనే పిల్లలతో నానా ఇబ్బందులు పడుతుంటే ఇక ఆమె బెంగుళూరు వెళితే వీళ్లని చూసేదెవరు? ఉదయమైతే ఆయా చూస్తుంది కానీ రాత్రి ఆమె ఉండదు కదా? అందుకే ఆమెను వెళ్లొద్దనీ చెప్పాను. ఈ సమయంలో తనకు కుదరదని చెప్పేయమని సలహా ఇచ్చాను. కానీ నా మాట శృతి వినలేదు. వెళ్లకపోతే ప్రమోషన్ పోవడంతోపాటు నెలకు పదిహేను వేల రూపాయల జీతం నష్టం అనీ కాబట్టి తీసుకువెళ్తానంది. అయినా మూన్నెళ్లు పెద్ద సమయమేమీ కాదని పిల్లని తనతోపాటు తీసుకెళ్లిపోయింది.

ఇక్కడ నేను కౌశిక్‌తో ఆ మూడు నెలలూ నానా తంటాలు పడ్డాను. ఎలాగోలా ఆ మూడు నెలలు గడిచి నిన్ననే శృతి వచ్చి మళ్లీ ఇక్కడ జాయినైంది.

ట్రాఫిక్ రానురాను పల్చబడ్డంతో డ్రైవింగ్ మీద కొద్దిగా దృష్టి తగ్గించి "ఎలా ఉంది ఈ రోజు వర్క్‌లోడ్.. అన్నీ ఓకేనా?" అన్నాను.

"ఈ రోజంతా చాలా టెన్షన్‌గా గడిచింది. మొన్న నేను బెంగుళూరు వెళ్లి చేసిన ప్రాజెక్టులో చాలా లోపాలున్నాయనీ, సాఫ్ట్‌వేర్ సరిగ్గా రన్ కావటం లేదని క్లయింట్స్ ఫిర్యాదు చేయడంతో ఈ రోజంతా మా టీమ్ మొత్తం దానిమీదే ధ్యాస పెట్టవలసి వచ్చింది. ఎలాగైతేనేం ఒక గంట క్రితం దాన్ని కరెక్ట్ చేయగలిగాం"

"శృతీ! నువ్వు కొన్నాళ్లపాటు ఏ కొత్త ప్రాజెక్టులు ఒప్పుకోకు. పిల్లల మీద ధ్యాస పెట్టు. దే నీడ్ యూ మచ్, పిల్లలకి అమ్మ ప్రేమ పంచకపోతే వాళ్లు అసంతృప్తికి గురవుతారు. కొన్నాళ్లకు దాని వల్ల విపరీతమైన ప్రవర్తనకు లోనవుతారు"

నా మాటలు ఆమె వినిపించుకున్నట్లు లేదు. కొద్దిసేపు మా మధ్య మౌనం. ఆ తరువాత ఆమె నోరు తెరిచింది.

"ఎంతసేపు ఉద్యోగం మానేయ్, ప్రమోషన్ తీసుకోకు, వర్క్ లోడ్ తగ్గించుకో... ఇవి తప్ప నీ నోటంట ఇంకేం మాటలురావా? అలాంటప్పుడు నా ఈ చదువు, ఉద్యోగం దేనికి చెప్పు? నువ్వు అనవసరంగా నా లాంటి ఉద్యోగస్తురాల్ని అందునా సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్‌ని చేసుకున్నావ్. నీక్కావలసింది హౌస్ వైఫ్. నీకు, నీ పిల్లలకి ఇరవైనాలుగ్గంటలూ చాకిరీ చేసే ఒక పనిమనిషి లాంటి భార్య. హాయిగా ఏ పల్లెటూరి చదువుకోని అమ్మాయినో చేసుకుంటే సరిపోయేది. అప్పుడు నాకు కూడా ఈ నాన్సెన్స్ తప్పేది. నీతో రోజూ ఈ తలనొప్పిని భరించలేక పోతున్నాను. ఏం నీకే ఉద్యోగం, కెరీర్ ముఖ్యమా? నాకొద్దా? నేనేం నీ కన్నా తక్కువ చదువుకున్నానా? తక్కువ సంపాదిస్తున్నానా? పెళ్లికి ముందు ఆడామగా అంతా సమానం, స్త్రీకి స్వేచ్ఛ అవసరం అనీ లెక్చర్లిచ్చి ఇప్పుడిలా..." తూటాల్లా వచ్చాయి ఆమె నోటి నుండి మాటలు. ఆమెకి కోపం వస్తే ఆపడం ఎవరి తరం కాదు.


"అయినా నేనేమీ సరదాకి ఈ ఉద్యోగం చేయటం లేదు. రోజూ నీలాగానే ఆఫీసులో పది గంటల పాటు కష్టపడుతున్నాను. ఇంటికి రాగానే మళ్లీ పిల్లల ఆలనాపాలనా చూస్తున్నాను. నేను ఉద్యోగం చేస్తుండబట్టే ఈ రోజు మనం పోష్ లొకాలిటీలో మంచి ఇల్లు కొనుక్కోగలిగాం. ఖరీదైన కారుని మెయింటైన్ చేస్తున్నాం. ఈ రోజు ఇవన్నీ స్టేటస్ సింబల్స్. ఈరోజు నేను అర్థాంతరంగా ఉద్యోగం మానేస్తే వాటి కోసం తీసుకున్న లోన్లు ఎలా తీర్చగలం చెప్పు? ఇవన్నీ నువ్వు ఎప్పుడూ ఆలోచించవు. నీకెంతసేపు ఇల్లు, పిల్లలు ఇవే ముఖ్యం" ఆమె మాట్లాడుతున్నప్పుడు పెదవులు వణకడాన్ని గమనించాను.

ఆమెలో ఆవేశాన్ని తగ్గించాలని కొద్దిసేపు మౌనం దాల్చాను. లేకపోతే ఆమె మరింత బరస్ట్ అవుతుంది. కొద్దిసేపటి తరువాత మాట్లాడేను. "శృతీ! కూల్ డౌన్! నేనెప్పుడూ నిన్ను ఉద్యోగం మానెయ్యమని చెప్పలేదు. కొన్నాళ్లపాటు వర్క్ లోడ్ తగ్గించుకోమంటున్నాను. వాళ్లకి ఐదేళ్లు వచ్చి స్కూళ్లకు వెళ్లిపోవడం మొదలుపెట్టాక నీ అవసరం అంతగా ఉండదు. కానీ ఈ వయసులో నీ అవసరం ఎక్కువ. ఎంతైనా తల్లి తల్లే. తండ్రి ఆ పాత్రని పోషించలేడు. అందుకే చెప్పాను. నీకిష్టం లేకపోతే ఇంకెప్పుడూ ఆ ప్రస్తావన తేనులే. అయినా నువ్వు ఇప్పుడు వచ్చేశావుగా. ఇంక సమస్యలేముంటాయి?" అన్నాను ఆమెను చల్లబరిచే ప్రయత్నం చేస్తూ.

"సమస్య లేదని నువ్వెలా అనుకుంటున్నావ్? అసలు సమస్య ఇప్పుడే మొదలు కాబోతోంది. మేము తయారుచేసిన సాఫ్ట్‌వేర్ని అమెరికాలోని క్లయింట్స్‌కి సరిగ్గా వివరించడానికి నన్నే మా యాజమాన్యం అమెరికా వెళ్లమంటోంది. వారం రోజుల్లో నేను బయలు దేరాలి"

ఆమె నోటి నుండి ఆ మాటలు విన్న నాకు మతిపోయింది. కాసేపటిదాకా ఆమె ఏం చెప్పిందో అర్థం కాలేదు. ఆ తరువాత అడిగాను. "నువ్వు వెళతానన్నావా? చిన్నపిల్లలు ఇంట్లో ఉన్నారని చెప్పలేదా?"

"పిల్లలు, కుటుంబ సమస్యలు ఇవన్నీ యాజమాన్యానికెందుకు చెప్పు? వాళ్లకి కావల్సింది పని. నేను ఆ ప్రాజెక్టుకి టీం లీడర్ని కాబట్టి అదీ కాక దాన్లో తరచూ సమస్య




లొస్తున్నాయి కాబట్టి నన్నే వెళ్లమని ఆర్డర్స్ ఇచ్చారు. లేక పోతే వాళ్లు మా కంపెనీకివ్వవలసిన ఫైనల్ పేమెంట్ పాతిక కోట్లు రావని వాళ్ల భయం. అందుకనీ నేను వెళ్లక తప్పదు. వెళతానని చెప్పేశాను కూడా. అప్పుడే ప్లేన్ టికెట్స్ కూడా రిజర్వ్ అయిపోయాయి. అక్కడ నేను లుండాలి"

"కనీసం నాతో మాటమాత్రమైనా చెప్పొచ్చుగా, నీకు నువ్వే అన్ని నిర్ణయాలు తీసేసుకుంటే ఎలా? బెంగుళూరంటే సరే ఎలాగోలా మేనేజ్ చేశాం. కానీ ఇప్పుడే కంగా అమెరికా వెళ్లిపోతే పిల్లాడ్ని పెట్టుకొని ఎలా ఉండ గలను చెప్పు. క్రితంసారి వాడు నన్ను బాగా ఇబ్బంది పెట్టాడు. నువ్వు ప్రతీసారి ఇలాగే ప్రవర్తిస్తే ఇక మన కాపురంలో కలతలు రాక తప్పదు. నేను నీలా హేస్టీ డెసిషన్స్ తీసుకోక తప్పదు" కోపంతో అన్నాను.

"ఏం డెసిషన్ తీసుకుంటావ్? నువ్వెప్పుడూ బెదిరించే విడాకులేగా? తీసుకో. నేను కూడా నీతో విసిగిపోయాను. పెళ్లయిన దగ్గర్నుంచి ఒకటే సొద. భార్యని గౌరవించడం తెలియని మనిషితో కాపురం చెయ్యడం చాలా కష్టం. అందరి మగవాళ్లలాగే నువ్వు కూడా పెద్ద స్వార్థపరుడివి" ఆమెలో ఈసారి ఆవేశం మరింత కట్టలు తెంచుకుంది.

"నేనేం విడాకుల ప్రసక్తి తేలేదు. నువ్వే ఎప్పుడూ తెస్తుంటావ్? బహుశా నీకే విడాకులంటే ఇష్టంలాగుంది. మొదటి నుంచి భర్తంటే గౌరవం లేదు నీకు. అదేమంటే ఎందుకు గౌరవం ఇవ్వాలంటావ్? నేను మన కాపురం గురించే కాదు ఎక్కువగా ఆలోచిస్తోంది పిల్లల భవిష్యత్ గురించీ ఆలోచిస్తున్నాను. మన తగువులు, పట్టింపుల వల్ల వాళ్లు తల్లిదండ్రుల్ని మిస్ అవుతారు. అనాథలవుతారు అదీ నా బాధ"

"ఆహా! ఎంతటి గొప్పవాడివి. పెళ్లాంతో విడిపోతే సమస్య లేదట. కానీ పిల్లల గురించే సమస్యట. ఎంతటి క్రూరాలోచన? మనం భార్యాభర్తలుగా విడిపోయిన తరువాత వాళ్లకి ఎవరి దగ్గర ఇష్టం ఉంటే వాళ్ల దగ్గర ఉంటారు. నేను వారం రోజుల్లో అమెరికా వెళ్లబోతున్నాను. మూడు నెలల తరువాత వస్తాను. ఈలోగా ఆలోచించుకో. ఇష్టమైతే నేను తిరిగి రాగానే విడాకుల పత్రాల్ని కోర్టులో దాఖలు చేద్దాం"

అంతే ఆ తరువాత మా మధ్య మాటలు లేవు. కారు ఇంటికి చేరుకోవడంతో ఆమె డోరు తెరచుకొని కోపంగా ఇంట్లోకి వెళ్లిపోయింది.

★ ★ ★

ఆ మర్నాటి నుంచి మామధ్య మాటలు కరువయ్యాయి. ఏదో యాంత్రికంగా రోజులు గడుస్తున్నాయ్. శృతి అమెరికా వెళ్లే రోజు దగ్గరపడసాగింది. ఎందుకో నాలో మునుపటి ఆవేశం లేదు. దాని స్థానే అంతర్మథనం మొదలైంది. నిజంగా విడాకులు తీసుకుంటే మా భవిష్యత్తేంటన్న ప్రశ్న నన్ను తొలచివేస్తోంది. సమాజంలో విడాకులు తీసుకున్న వాళ్లంటే చాలా చిన్న చూపు. అదీగాక పిల్లలు అనాథలైపోతారు. ఇద్దరం వయసులో ఉన్నాం

కాబట్టి విడాకుల తరువాత మళ్లీ పెళ్లి చేసుకుంటే పిల్లల భవిష్యత్తు ఏమిటి? ఎందుకంటే నేను కూడా అటువంటి బాధితున్నే. ఆ సమయంలో నాకు నా బాల్యం గుర్తుకు రాసాగింది.

మా అమ్మానాన్నలు ఇద్దరూ పెద్ద ఉద్యోగాలు చేసే వారు. అమ్మ హైదరాబాద్‌లోని ఒక ఫార్మా కంపెనీలో ఎకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసేది. ఆమె అహ్మదాబాద్ ఐ.ఐ.ఎమ్.లో చదివింది. అలాగే నాన్నగారు ఒక ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసేవారు. వాళ్లకి నేనొక్కణ్ణే సంతానం.

కానీ ఎందుకో తరచూ అమ్మానాన్నలిద్దరూ గొడవ పడే వారు. రాత్రిళ్లయితే పెద్దగా అరుచుకుని పోట్లాడుకునేవారు. ఉదయం అంతా స్కూల్లో గడిపిన నాకు రాత్రి అవుతుందంటే భయం వేసేది. ఒక్కోసారి అమ్మ కోపంతో భోజనం చేసేది కాదు. అప్పుడు నాకు కూడా తినబుద్ధి వేసేది కాదు. అలాగే ఆకలితో నేల మీద పడుకునేవాణ్ని. అలా వాళ్లు చీటికి మాటికి గొడవలు పడుతూ నాకు పదేళ్లు వచ్చేసరికి విడాకులు తీసుకున్నారు. మా నాన్నగారికి మా అమ్మ మీద అనుమానం ఉండేదని అందుకే తరచూ గొడవలు పడుతుండేవారని తరువాత తెలిసింది. ఆ తరువాత నేను పడ్డ బాధలు అన్నీ ఇన్నీ కావు. కోర్టు ఆర్డరువల్ల నేను కొన్నాళ్లపాటు అమ్మ దగ్గర, కొన్నాళ్లు నాన్న దగ్గర ఉండేవాడిని. నాకెందుకో మా అమ్మానాన్నలు కలిసి ఉంటే బాగుండేదనిపించేది.

నేను పదవ తరగతిలో ఉండగా నాన్న మరో వివాహం చేసుకోవడంతో నేను శాశ్వతంగా అమ్మ దగ్గర కొచ్చేశాను. మా అమ్మ మాత్రం నా గురించి రెండవ వివాహం చేసుకోలేదు. అందుకే మా అమ్మంటే నాకు ప్రాణం. ఆ తరువాత నా చదువు సాఫీగా సాగి ఇంజనీరింగ్ పూర్తిచేయగలిగాను.

అందుకే నాకు విడాకులంటే చాలా భయం. తల్లిదండ్రుల విడాకుల వల్ల బాధలుపడ్డ నేను అదే పని మళ్లీ నేను చేసి పిల్లల్ని అనాథల్ని చేయడం చాలా తప్పుగా అనిపించసాగింది. అందుకే శృతి తొందరపడినా నేను తొందరపడదల్చుకోలేదు. ఇటువంటి ఆలోచనల్ని మొగ్గలోనే తుంచెయ్యాలని నిశ్చయించుకున్నాను. ఆ రోజు నేనొక దృఢ నిర్ణయానికొచ్చాను.

* * *

ఆ రోజు శృతి అమెరికా వెళుతున్న రోజు. ఉదయం పదకొండు గంటలకు ఆమె ఫ్లయిట్. పది గంటల వేళ ఆమె కోసం కంపెనీ కారొచ్చింది. ఆమె బయలుదేరే ముందు నా రూములోకొచ్చి "నేను వెళుతున్నాను. పిల్లాడు జాగ్రత్త, పిల్లని నేను తీసుకెళుతున్నాను" అంటూ వెళ్లిపోబోయింది.

"శృతీ! ఆగు. నేను కార్లో డ్రాప్ చేస్తాను. కంపెనీ కారును పంపించెయ్" అన్నాను.

నా మాటలు విన్న ఆమె నా వైపు ఆశ్చర్యంగా చూసింది. కొద్దిసేపటి తరువాత మా కారు ఎయిర్‌పోర్ట్ వైపు దూసుకుపోసాగింది. వెనుక పిల్లలిద్దరూ, ముందు మేమిద్దరం. పిల్లలిద్దరూ బాగా అల్లరిచేస్తున్నారు. కౌశిక్ వాళ్లమ్మ అమెరికా వెళుతోందని తెలిసి రాత్రంతా బాగా ఏడ్చాడు. కానీ త్వరగా వచ్చేస్తుందని నేనే వాణ్ని ఊరుకోబెట్టాను.

అరగంట తర్వాత కారు ఎయిర్‌పోర్ట్ చేరుకుంది. శృతి, పిల్లని తీసుకొని వెళ్లిపోతుంటే నేను ఆమె చేతిలోని పిల్లని ఎత్తుకొని ముద్దులాడి ఆమెకిచ్చేశాను. శృతి కూడా కౌశిక్‌ని ఎత్తుకొని ముద్దులాడింది. జాగ్రత్తగా ఉండమనీ చెప్పింది. ఆమె లోపలికి వెళుతుండగా అప్పుడు చెప్పడం మొదలుపెట్టాను.

"శృతీ! విష్ యూ హేపీ బోన్‌వోయాజ్! ఏ విధమైన టెన్షన్స్ పెట్టుకోవద్దు. ఆనందంగా పని పూర్తి చేసుకొని తిరిగిరా. నీ కోసం నేను, బాబు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటాం. అదీగాక మొన్నటి గొడవలేవీ మనసులో పెట్టుకోవద్దు. మన మధ్య ఉన్నది మంచుగోడ. ఇది తాత్కాలికం. ముఖ్యంగా నువ్వు మొన్న అన్న విడాకులు లాంటి మాట మళ్లీ నీ నోట వినడం నాకు అసలు ఇష్టం లేదు. మనకు మన పిల్లల భవిష్యత్ ముఖ్యం. భార్యాభర్తలన్న తరువాత ఇటువంటివి వస్తూనే ఉంటాయి. అవేమీ మనసులో పెట్టుకోకు" అన్నాను.

ఇంతలో శృతి కళ్లు తుడుచుకోవడాన్ని గమనించాను. అప్పుడు చూశాను ఆమె ముఖాన్ని. ఆమె కళ్లల్లో తడి. ఎప్పుడూ ఎంతో నిబ్బరంగా ఉండే ఆమెలో అంతటి బేలతనాన్ని మొదటిసారిగా గమనించాను.

"సారీ! నేను కూడా ఆ రోజు తొందరపడ్డాను. దానికి కారణం పనిలో వత్తిడే అనుకుంటా. నేను త్వరగా వచ్చెయ్యడానికి ప్రయత్నిస్తాను. ఏదో ఆవేశంలో అలా అన్నాను కానీ పిల్లలంటే నాకూ ప్రాణం! మీరన్నా కూడా! అందుకే కౌశిక్‌ని చూసుకోవడానికి మా అమ్మని పిలిచాను. ఈ రోజు సాయంత్రం ఆమె వస్తోంది" అంటూ నా చేతిని తన చేతిలోకి తీసుకుంది.

ఆ క్షణంలో ఆ స్పర్శ నాకెంతో హాయినివ్వసాగింది. ఆ ఆనందంతో ఆమెకు మనస్ఫూర్తిగా వీడ్కోలు చెప్పాను.



## మరో రెండేళ్లు...

***కత్రినా కైఫ్ తాజా చిత్రం 'రాజ్‌నీతి'లో సోనియా గాంధీ తరహా పాత్రని పోషించిందనే వార్తల్ని ఆమె ఇటీవల ఖండించింది. 'అసలు అలాంటి ఊహాగానాలకే తావులేదు. నేను వేసిన పాత్ర రాజకీయప్రాధాన్యమైంది కాబట్టి అలాంటి అంచనాలు వేసినట్టున్నారు అంతే' అని తేల్చిపారేసిన కత్రినా- 'మరో రెండేళ్ల తర్వాత తను పెళ్లి చేసుకునే అవకాశం వుంద'ని చెప్పింది పాతికేళ్ల ప్రాయంలో వున్న ఈ బాలీవుడ్ భామ. 'మనం ఎన్నో అనుకుంటాం, కానీ ఆ భగవంతుడు ఎలా రాస్తే అదే జరుగుతుంది'- అంటూ కొసమెరుపిస్తోంది కత్రినా.***